# పెద్దచేప

**సుమారుగా మా నాన్నగారు చనిపోయి రెండు నెలలయింది. ఆ రోజునుంచి కూడా నేను మండల రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే వున్నాను-లీగల్ హెయిర్ సర్టిఫికెట్ కోసం!**

ఆయనకి ఆఫీసునుండి రావలసిన పి.ఎఫ్.గ్రాట్యుటీ మరియు పెన్షన్‌లను అమ్మ పేరుమీద సెటిల్ చేసేసారు. అయితే 'ఎల్లైసీ'కి సంబందించి 'నామినీ' పేరును పాలసీలో చేర్పించలేదు.

ఎల్లైసీకి సంబంధించి నామినీ లేని పాలసీలకు ఆ సొమ్మును చనిపోయిన వ్యక్తి వారసులకు అందజేస్తారు.

నాన్నకి సంబంధించి నేను, చెల్లాయ్, అమ్మ వారసులం!

నాన్నగారి మరణానికి సంబంధించి మున్సిపల్ కార్పొరేషన్ వారిచ్చిన మరణ ధృవీకరణతో పాటు..నేనూ, చెల్లాయ్, అమ్మ మూకుమ్మడిగా మా మధ్యన ఎలాంటి తగాదాలు లేవని..అమ్మ పేరు మీదగా వారసత్వపు సర్టిఫికెట్‌ను ఇప్పించవలసినదిగా ఒక అర్జీని రాసి మండల రెవెన్యూ కార్యాలయంలో ప్యూన్‌ని కలిసాను.

వాడు ఆ ఆఫీసులో ఒక మూలన కూర్చుని వున్న ఒక గుమాస్తాని చూపించి ఆ కాగితాలతోపాటు ఒక వందరూపాయల్ని అతనికిమ్మని చెప్పాడు.

ఆ ప్యూన్ చెప్పినట్టుగానే ఆ కాగితాలతోపాటు వంద రూపాయల్ని కూడా ఆ గుమాస్తాకి అందజేసాను. పది రోజుల తర్వాత వెళ్ళి వాకబు చేసాను.

"ఆ పేపర్లను ఆరోజే ఆర్.ఐగారికి పంపించేసాను. ప్రస్తుతం అది ఆర్.ఐ.గారి టేబిల్ మీదనే వున్నాయి. బహుశా ఈ మధ్యన ఎంక్వైరీకి రావచ్చు. ఒక అయిదొందలు ఆయనకివ్వండి" నిర్మొహమాటంగానే చెప్పాడు.

ఆర్.ఐ.సీటుని కనుక్కుని నెమ్మదిగా ఆయన దగ్గరికి వెళ్లాను.

"నమస్తేసార్! మా అమ్మగారి పేరుమీద లీగల్ హెయిర్ సర్టిఫికెట్ కోసం అప్లై చేసాను. అది ప్రస్తుతం మీ టేబిల్ మీద ఉందని మీ గుమాస్తా చెప్పాడు"

ఆయన టేబిల్ మీదనున్న పేపర్లన్నీ వెదికి..అందులోనుంచి మా పేపర్లని బయటకు తీసాడు. గుమాస్తా పుటప్ చేసిన నోట్‌ని పూర్తిగా చదివాడు.

"మీకన్నా ముందుగా అప్లికేషన్స్ పెట్టుకున్న వాళ్ళు సర్టిఫికెట్స్ చాలా పెండింగ్ వున్నాయి. ఒక నెలరోజులు ఆగి రండి"

జేబులోనుంచి అయిదొందల రూపాయల నోటుని తీసి ఆయన చేతిలో పెట్టాను.

ఆ తర్వాత ఆయన నాన్నకి సంబంధించిన విషయాలన్నీ అడిగాడు.

అన్నింటికి సమాధానం చెప్పాను.

"జీవిత బీమాకి సంబంధించి సుమారుగా ఎంతసొమ్ము రావచ్చు. ఎందుకంటే సుమారుగా ఆ సొమ్మును లీగల్ హెయిర్ సర్టిఫికెట్‌లో మెన్షన్ చెయ్యవలసి వుంటుంది"

"ఎల్లైసీ వాళ్ళు చెప్పిన ప్రకారం సుమారు రెండు లక్షలు వుండొచ్చు!" అన్నాను. వెంటనే ఆ ఆర్.ఐ. అటూ ఇటూ చూసి "చాలా చిన్న చిన్న సర్టిఫికెట్‌లకే అయిదు వందలు ఇస్తారు చాలామంది. మీకు రాబోయేది చాలా పెద్దమొత్తం ఆలోచించండి!"

నేను నిశ్శబ్దంగా వుండిపోయాను.

"ఈ సర్టిఫికెట్‌కి సుమారుగా పదివేలు ఖర్చవుతుంది"

ఒక్కసారిగా స్థాణువైపోయాను.

మా నాన్న కష్టపడి సంపాదించుకున్న సొమ్ములో నుంచి నెలనెలా పైసా పైసా పోగుచేసి ఎల్లైసీ ప్రీమియంలను కట్టుకొచ్చారు. మాకు ఏ కష్టం తెలీకూడదని, మా చదువులు మధ్యలో ఆగిపోకూడదని..అ ఎల్లైసీ సొమ్ముతో మా చదువులు సాగాలని నాన్న కోరికగా మా అమ్మ చెప్పింది!

అయితే పాలసీ చేయించేటప్పుడు 'అమ్మ' పేరు సరిగ్గా తెలియక ఆ ఏజెంటు ఆ ఎల్లైసీ ఫార్మ్‌లో రాయలేదు. ఆ తర్వాత నాన్న కూడా అదిగో ఇదిగో 'అమ్మ' పేరు చేర్పిస్తానంటూనే బద్ధకించేసారు.

ఆ ఆర్.ఐ. మాటలకు నాకు చాలా కోపం వచ్చింది.

అయితే ఇలాంటి వాళ్ళని ఎ.సి.బి. వాళ్ళకి పట్టించేయాలనిపించింది.

"మీరు ఆ పదివేలు తెస్తే..ఎంక్వైరీ కూడా అక్కర్లేకుండా వెంటనే ఎమ్.ఆర్.ఓ. సంతకం చేయించి ఆ సర్టిఫికెట్ ఇప్పించేస్తాను. నేనడిగింది చాలా చిన్న మొత్తం! మరొకసారి ఆలోచించుకోండి"

"తర్వాత ఏ విషయం చెప్తాను సార్!"

"అలాగే" తలూపాడు ఆర్.ఐ.

ఆలోచిస్తూ బస్టాప్ చేరుకున్నాను.

ఆ తర్వాత ఒకరోజు-

నేను స్నేహితుడి ఇంటికి వెళ్ళేందుకు బస్టాప్‌లో వుండగా..

ఎమ్.ఆర్.ఓ. ఆఫీసులోని ఆర్.ఐ. కూడా వచ్చి అదే స్టాప్‌లో బస్ కోసం నిల్చున్నాడు.

నేను అతడి దృష్టిలో పడకూడదని తల తిప్పేసుకున్నాను. బహుశా అతడి స్కూటర్ ప్రాబ్లెమ్ వస్తే బస్ కోసం వచ్చాడేమోననుకున్నాను.

ఇంతలో బస్ వచ్చింది. నేనెక్కిన బస్సే అతడూ ఎక్కాడు. బస్ నెమ్మదిగా కదిలింది.

రెండు మూడు స్టాప్‌ల తర్వాత బస్‌లో ఏదో కలకలం!

"బస్సాపండి!" పెద్దగా అరుపు వినిపించింది, అది ఆర్.ఐ. గొంతులానే వుంది.

కీచుమంటూ సడెన్‌బ్రేకుతో బస్సాగింది.

ఇద్దరు ముగ్గురు వ్యక్తులు ఒకతన్ని గబగబా కిందకి దింపి బాదేస్తున్నారు.

'ఏమిటన్నట్టు' నేను వాళ్ళ వైపు చూసాను.

"వీడొక జేబుదొంగ! అదిగో ఆ పెద్దమనిషి జేబులో నుంచి పర్స్ కొట్టేసాడు" అంటూ ఆర్.ఐ.ని చూపించారు.

నేను ఆర్.ఐ. పక్క చూసేసరికి..ఆ పెద్దమనిషి ఆర్.ఐ. జరిగిన విషయాన్ని ఎవరికో వివరిస్తున్నాడు.

ఎందుకో నాకు ఆ క్షణంలో ఆ జేబుదొంగని చూసి బాధనిపించింది.

లంచాలు తీసుకునే ఆర్.ఐ. సమాజం దృష్టిలో పెద్దమనిషి! జేబులుకొట్టే వీడు దొంగ!

మనం ఒక గీత గీసి దాని పక్కన ఒక చిన్నగీత గీస్తే..ముందు మనం గీసిన గీత పెద్ద గీతలా కన్పిస్తుంది!

అలాకాక..ఆ గీత పక్కన దానికంటే పెద్ద గీతను గీస్తే ముందు గీసిన గీత చిన్న గీతలా కన్పిస్తుంది.

నా దృష్టిలో ఆ ఆర్.ఐ. పెద్ద దొంగలా కన్పించాడు! ఆ జేబుదొంగ చిన్న దొంగలా కన్పించాడు.

ఆ వెంటనే అప్పటికి ఏదో సర్ది చెప్పి..వాళ్ళబారి నుండి ఆ జేబుదొంగని విడదీసి వెళ్ళిపొమ్మని కోపం నటించి, కసిరి పంపించేసాను అందరిలాగే!

ఎదురుగా పెద్ద అన్యాయాలు, అక్రమాలు జరుగుతున్నా... నిరభ్యంతరంగా...నిర్లజ్జగా..ఇది మా జన్మహక్కు అన్నట్టుగా అధికారులు లంచాలు తీసుకుంటున్నా పట్టించుకోని 'జనం'- ఒక చిన్న జేబుదొంగ జేబు కత్తిరించినప్పుడు మాత్రం అదొక పెద్ద నేరంలా భావించి వాడిని చితగ్గొట్టి ఏదో సాధించినట్టుగా పెద్ద 'బిల్డప్' ఇస్తారు.

అందుకే వ్యక్తిగతంగా ముందు మనం మారాలి! ఆ తర్వాత సమాజం అదే మారుతుంది.

వెంటనే-పక్కనే వున్న 'ఆటో'ని పిల్చి-ఎ.సి.బి. ఆఫీసు అడ్రస్ చెప్పి బయల్దేరమన్నాను.

-గవర ఈశ్వరరావు (విశాఖపట్నం)